బుధ వారం
01-03-2023
సంపుటి - 08,
సంచిక - 265
పేజీలు - 4
వెల రూ. 5/-
Telangana
Andhra Pradesh

RNI NO: TELTEL/2016/73311

www.samasamajam.in

# సమ సమాజం

SAMA SAMAJAM TELUGU DAILY

తెలుగు దిన పత్రిక

❍ Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Warangal, Medak, Karimnagar, Kammam, Vishakapatnam, Vijayawada, Ongole

### మెడికల్ కాలేజీల్లో ర్యాగింగ్

## నిరోధక చర్యలు

ప్రీతి ఘటనపై సమగ్ర విచారణ జరపాలని గవర్నర్ ఆదేశం





**హైదరాబాద్, ఫిబ్రవరి 28 (సమ సమాజం):** డాక్టర్ ప్రీతి ఘటనతో మెడికల్ కాలేజీలపై గవర్నర్ తమిళి సై దృష్టి సారించారు. డాక్టర్ ప్రీతి ఆరోగ్యం సరిగా లేదని సమాచారం ఇచ్చిన కాళోజీ హెల్త్ సైన్సెస్ యూనివర్సిటీ వీసీకి గవర్నర్ లేఖ రాశారు. ప్రీతి ఆరోగ్యం పై తప్పుడు సమాచారం ఇచ్చి నిందితుడ్ని కాపాడేందుకు ప్రయత్నించారని యూనివర్సిటీ అధికారులపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి నిందితులను కఠినంగా శిక్షించాలని ఆదేశించారు. మెడికల్ కాలేజీలలో యాంటి రాగింగ్ చర్యలు గట్టిగా తీసుకోవాలని గవర్నర్ తమిళి సై సూచించారు. మహిళా మెడికోలకు ప్రత్యేక గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేయాలని చెప్పారు. ఇలాంటి సంఘటనలలో ఎలాంటి ఉదాసీనత లేకుండా, తక్షణం స్పందించి కాలేజీలలో బాధ్యులపై కఠిన తీసుకోవాలని సూచించారు. రాష్ట్రంలోని ప్రతి మెడికల్ కాలేజీలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. అలాగే.. పీజీ మెడికోల డ్యూటీ సమయాలు, వారికి సంబందించి సరైన విశ్రాంతి లాంటి అంశాలపై శ్రద్ధ పెట్టాలని చెప్పారు. మహిళా మెడికోల కోసం కౌన్సిలింగ్ సెంటర్లు ఏర్పాటు చేయాలని గవర్నర్ తమిళిసై ఆదేశించారు.

### ప్రజలకు మరింత చేరువగా

## డిజిటల్ సేవలు

ప్రజా జీవితంలో సాంకేతికతదే తొలి ప్రాధాన్యం




**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 28 (సమ సమాజం):** దేశ పౌరుల జీవితాలను మార్చడంలో సాంకేతికత చాలా అవసరం పడుతుందని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. ఈజ్ ఆఫ్ లివింగ్ యూజ్ టెక్నాలజీ అనే అంశంపై బడ్జెట్ అనంతర వెబ్‌నార్‌లో మాట్లాడిన మోడీ.. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ (ఏఐ) ఉపయోగించి పరిష్కరించగల పది సమస్యలను పౌరులు గుర్తించాలని కోరారు. వన్ నేషన్ వన్ రేషన్, ఆరోగ్య సేతు, మీ సేవ, ఈ సేవ కేంద్రాలు ప్రభుత్వంతో ప్రజల కమ్యూనికేషన్‌ను సులభం చేశాయన్నారు. 2024 కల్లా ఏఐ ఆధారిత రంగాల్లో దేశం అభివృద్ధి సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. వైద్య, విద్య, వ్యవసాయం పరిశ్రమల్లో 5జీ, ఏఐ విస్తరణ అవసరమని, డిజిలాకర్ వంటి సేవలను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. చిన్న వ్యాపారులకు, వీధి వ్యాపారుల కోసం జెమ్ పోర్టల్, రైతుల అనుసంధానం కోసం ఈ-నామ్ ని తీసుకొచ్చామన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయం వంటి అనేక రంగాల్లో 5జీ, కృత్రిమ మేధాశక్తి వంటి టెక్నాలజీల వల్ల పెను మార్పులు వస్తాయని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. సామాన్యులు ఎదుర్కొంటున్న సమస్యల్లో కృత్రిమ మేధాశక్తి తో పరిష్కరించగలిగిన 10 సమస్యలను గుర్తించాలని పిలుపునిచ్చారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా ఎదగాలనే లక్ష్యాన్ని సాధించడానికి టెక్నాలజీ దోహదపడుతుందన్నారు. డిజిటల్ విప్లవం ఫలితాలు ప్రజలందరికీ చేరేవిధంగా చేయడం కోసం ఆధునిక డిజిటల్ మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. డిజిటల్ విప్లవం ఫలితాలు ప్రజలందరికీ చేరేవిధంగా చేయడం కోసం ఆధునిక డిజిటల్ మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. చిన్న తరహా వ్యాపార సంస్థలు నిబంధనలను పాటించడం కోసం చేయవలసిన ఖర్చులను తన ప్రభుత్వం తగ్గించాలనుకుంటోందని తెలిపారు. తొలగించదగిన అనవసరమైన ఖర్చుల జాబితాను తయారు చేయాలని పారిశ్రామిక రంగాన్ని కోరారు. తన ప్రభుత్వం ఇప్పటి వరకు 40,000 కాంప్లియె 2వ

### తిరుమలలో

#### కొనసాగుతున్న రద్దీ

అనంతవరంలో 4 నుంచి బ్రహ్మోత్సవాలు



**తిరుమల,ఫిబ్రవరి 28 (సమ సమాజం):** కలియుగ ప్రత్యక్షదైవం శ్రీ వేంకటేశ్వరస్వామి కొలువు దీరిన తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతుంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు గోవిందా నామస్మరణతో శ్రీవారిని దర్శించుకుంటున్నారు. టోకెన్లు లేని భక్తులకు శ్రీవారి సర్వదర్శనానికి 18 గంటల సమయం పడుతుందని టీటీడీ అధికారులు వెల్లడించారు. సోమవారం స్వామివారిని 71,387 మంది భక్తులు దర్శించుకోగా 24,701 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు సమర్పించుకున్న కానుకల ద్వారా హుండీ ఆదాయం రూ. 5.71 కోట్లు వచ్చిందని వివరించారు. ఇదిలావుంటే గుంటూరు జిల్లా తూళ్లూరు మండలం అనంతవరం గ్రామంలోని శ్రీవేంకటేశ్వర స్వామివారి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు మార్చి 4 నుంచి 7వ తేదీ వరకు వైభవంగా జరగనున్నాయి. మార్చి 4న సాయంత్రం 6 గంటలకు అంకురార్పణ, 5న ఉదయం 7.45 గంటలకు మీన లగ్నంలో ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయని వెల్లడించారు. రాత్రి 7 నుంచి 9 గంటల వరకు అశ్వవాహనసేవ, 6న రాత్రి 7 నుంచి 9 గంటల వరకు స్వామి అమ్మవార్లకు శాంతి కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహిస్తామన్నారు. 7న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు వసంతోత్సవం, చక్రస్నానం, పూర్ణాహుతి, 8న సాయంత్రం 5 నుంచి రాత్రి 9 గంటల వరకు పుష్పయాగం కన్నులపండుగగా జరుగనుందని వెల్లడించారు.

# దేశంలో అగ్రభాగాన సిరిసిల్ల బిడ్డలు

2వేల మంది ఇంటర్ విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ♦పోటీ పరీక్షలకు సన్నద్ధం కావాలన్న మంత్రికెటిఆర్

**రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 28 (సమ సమాజం):** రాజన్న సిరిసిల్ల బిడ్డలు రాష్ట్రంలో, దేశంలో అగ్రభాగాన ఉన్నారంటే మీ తల్లిదండ్రులు, అధ్యాపకులు, ప్రజాప్రతినిధులైనా తామంతా గర్వపడుతాం అని రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. రాబోయే మూడు నెలలు బాగా కష్టపడి చదివి మంచి ర్యాంకులు సాధించాలని మనస్ఫూర్తిగా ఆశీర్వదిస్తున్నానని కేటీఆర్ తెలిపారు. గిఫ్ట్‌ఏ స్మైల్ కార్యక్రమంలో భాగంగా ఎల్లారెడ్డిపేట పరిధిలో 2 వేల మంది ఇంటర్ విద్యార్థులకు కేటీఆర్ ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన సభలో కేటీఆర్ ప్రసంగించారు. ఈ ట్యాబ్‌లను సమర్థవంతంగా ఉపయోగించుకోవాలని కేటీఆర్ సూచించారు. చదువుల కోసం వాడండి. ఇందులో ఇంటర్నెట్ పెట్టి ఇన్‌స్టాగ్రాం, ఫేస్‌బుక్ పెట్టి అడ్డమైన కార్యక్రమాలు చేయకండి. అంటే వాటితో టైం వేస్ట్



3వ

## యాదాద్రిలో వైభవంగా బ్రహ్మోత్సవాలు

### స్వామికి ఘనంగా ఎదుర్కోలు ఉత్సవాలు



**యాదాద్రి, ఫిబ్రవరి 28 (సమ సమాజం):** యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహ స్వామివారి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగామంగళవారం నారసింహుని తిరుకల్యాణోత్సవం నిర్వహించనున్నారు. తిరుకల్యాణం నేపథ్యంలో బ్రహ్మోత్సవ మండపాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. కార్యక్రమాన్ని సుమారు 10 వేల మంది భక్తులు తిలకించేలా ఏర్పాట్లు చేసారు. మంగళవారం రాత్రి 8 గంటలకు తులాలగ్నంలో సామి అమ్మవార్ల కల్యాణం నిర్వహిస్తారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారికి ప్రభుత్వం తరపున 3వ

# మనీష్ సిసోడియాకు సుప్రీంలో చుక్కెదురు

సిబిఐ అరెస్ట్‌పై జోక్యం చేసుకోలేమన్న సుప్రీం● హైకోర్టుకు వెళ్లాలని సిసోడియాకు సూచన


**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 28 (సమ సమాజం):** మద్యం పాలసీ కుంభకోణం కేసులో సీబీఐ కస్టడీలో ఉన్న ఢిల్లీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియాకు సుప్రీంకోర్టులో నిరాశ ఎదురైంది. సీబీఐ అరెస్ట్ వ్యవహారంలో తాము జోక్యం చేసుకోబోమని, హైకోర్టుకు వెళ్లాలని సూచించింది. అంతకు ముందు తన అరెస్ట్‌ను వ్యతిరేకిస్తూ సిసోడియా సుప్రీం తలుపు తట్టారు. సిసోడియా పిటిషన్‌పై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్ ధర్మాసనం విచారణ జరిపింది. సీబీఐ తనను అరెస్టు చేయడాన్ని సవాల్ చేస్తూ సిసోడియా దాఖలు చేసిన పిటిషన్ పై



3వ

# భారీగా పెరిగిన విద్యుత్ డిమాండ్

**హైదరాబాద్, ఫిబ్రవరి 28 (సమ సమాజం):** రాష్ట్రంలో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరిగింది. వేసవి సమీపిస్తున్న తరుణంలో డిమాండ్ భారీగా పెరిగినట్లు అంచనా. ఇది రోజు రోజుకు మరింత పెరుగుతున్నది. తెలంగాణ చరిత్రలోనే తొలిసారిగా ఎన్నడూ లేని విధంగా రికార్డుస్థాయిలో మంగళవారం డిమాండ్ ఏర్పడింది. మధ్యాహ్నం సమయంలో అత్యధికంగా 14,794 మెగావాట్ల విద్యుత్ డిమాండ్ నమోదైంది. గతేడాది ఇదే రోజున గరిష్ఠంగా 12,966 మెగావాట్ల వినియోగం ఉండడం గమనార్హం. రాబోయే రోజుల్లో



- ఒక్కరోజే గణనీయంగా పెరిగిన వాడకం
- 37శాతం వ్యవసాయానికే వినియోగం
- ట్రాన్స్‌కో జెన్కో సీఎండీ ప్రభాకర్ రావు వెల్లడి

3వ

# సంపాదకీయం

## రాజ్యాంగ వ్యవస్థలను రక్షించుకోవాలి !

మోడీ ద్వయం ఏది చెబితే అదే చట్టంగా..రాజ్యాంగంగా అమలవుతున్న తీరుతో ఇప్పుడు విపక్షాలు ఏకం అయ్యే పరిస్థితి వచ్చింది. రాజ్యాంగ వ్యవస్థలను గుప్పిట్లో పెట్టుకుని చేస్తున్న విన్యాసం చూపరులకు విసుగు తెప్పిస్తోంది. అయితే మోడీని ప్రశ్నించే ముందు తమ రాష్ట్రాల్లో తాము ఎంత సచ్ఛీలంగా పాలన చేస్తున్నామో గమనించాలి. ప్రజలు చేస్తున్నవిమర్శలకు సమాధానం చెప్పాలి. అలాగని కేంద్రం అధికార దుర్వినియోగాన్ని తప్పుపట్టకుండా ఉండలేం. కేంద్రం చేస్తున్న దుర్వినియోగాన్ని, దుర్మార్గాలను ఎండగట్టాల్సిందే. ఇకపోతే ఆదానీ కుంభకోణాలపై, మోసాలపై చలనం లేని బిజెపి ప్రభుత్వం..సిసోడియా విషయంలో మాత్రం దూకుడు ప్రదర్శించింది. నిజానికి మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న తీరు కేవలం కక్ష సాధింపు వ్యవహారంగా కనిపిస్తోంది. అవినీతి లేదా ముడుపులు తీసుకున్న వ్యవహారం నిజమే అయినా ఒక్క సిసోడియేనే అవినీతికి పాల్పడ్డారా అన్నది చెప్పాలి. ఎంతమంది అవినీతికి పాల్పడ్డారో వారందరినీ ఒకే గాటన కట్టివుంటే బాగుండేది. రాజకీయ అవినీతిని, కార్పోరేట్ మోసాలను అరికట్టే విషయంలో ఎవరికీ అభ్యంతరం లేదు. కానీ మోడీ మాత్రం విమర్శలను పట్టించుకోవడం లేదు. ప్రజాస్వామ్యాన్ని పట్టించు కోవడం లేదు. రాజ్యాంగ వ్యవస్థలను గుప్పిట్లో పెట్టుకుని ఎంతకాలం ఇలా ముందుకు వెళతారన్నది చూడాలి. సిబిఐ, ఐటి, ఇడి దాడులపై వస్తున్న ఆరోపణలను పట్టించుకోవడం లేదు. ఆయా రాష్ట్రాల్లో చిచ్చు పెట్టి అధికారాన్ని చేజిక్కించుకుంటున్న తీరు కాంగ్రెస్ పాలనకన్నా దారుణంగా ఉంది. వ్యవస్థలను భ్రష్టు పట్టించిన ఘనత కాంగ్రెస్‌దయితే..అంతకుమించిన దారుణాలను ఇప్పుడు మోడీ అనుసరిస్తున్నారు. ప్రజల సమస్యలను పక్కన పెట్టేందుకు ఇలా చేస్తున్నారా అన్నది కూడా అనుమానం కలుగుతోంది. ఇకపోతే ఇటీవల శివసేన విషయంలో కేంద్ర ఎన్నికల సంఘం తీసుకున్న నిర్ణయం అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. అయితే ఇలా జరుగుతుందని ముందే తెలిసినా..ఇంత నిస్సిగ్గుగా జరుగుతుందని అనుకోలేదు. గతంలో ఉమ్మడి ఎపిలో ఎన్టీఆర్‌పై చంద్రబాబు తిరుగుబాటు సమయంలో కూడా ఇలాగే జరిగింది. ఎన్టీఆర్ నుంచి పార్టీని, గుర్తును చంద్రబాబు లాగేసుకున్నారు. బ్యాంక్ అకౌంట్‌ను సీజ్ చేయించారు. అంతగా అవమానించిన ఎన్టీఆర్‌ను ఇప్పుడు మళ్లీ బొమ్మ పెట్టుకుని ఊరేగుతున్నారు. శివసేనను దెబ్బకొట్టిన మోడీ ఇప్పుడు ఏకంగా ఆ పార్టీని మొత్తంగా దెబ్బకొట్టే ప్రయత్నాల్లో ఉన్నారు. శివసేనలో చీలిక తేవడమే గాకుండా..చీలిక వర్గమే అసలుసిసలు శివసేనగా ఇసి గుర్తించేలా చేశారు. ఏక్‌నాథ్ షిండే వర్గాన్ని అసలైన శివసేన పార్టీగా గుర్తిస్తూ, దానికే ఎన్నికల చిహ్నమైన విల్లు, బాణం'కేటాయిస్తూ భారత ఎన్నికల సంఘం నిర్ణయాన్ని ప్రకటించింది. ఇది ఓ రకంగా బాలాసాహెబ్‌ను అవమానించడమే. ఇలా పార్టీ నుంచి బయటకు వచ్చిన వారికి పార్టీని ధారాదత్తం చేయడం వంటి చర్యలు ఆషామాషీగా జరిగినవని అనుకోవడానికి లేదు. అందుకే ఇసిని కూడా రాజ్యాంగబద్ధంగా ఎన్నుకునే సంస్థగా మార్చాలని మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, శివసేన నాయకుడు, ఉద్ధవ్ బాలాసాహెబ్ థాకరే ఆగ్రహం వెలిబుచ్చారు. కేవలం బిజెపికి మద్దతు పలక నందుకు ఉద్ధవ్‌పై కక్షకట్టి..ఆయన పార్టీని చీల్చి..పార్టీని షిండేకు అప్పగించిన తీరు వెనక ఎంతటి రాజకీయం ఉందో గమనించాలి. అందుకే ఎన్నికలకు సంబంధించిన ఈ రాజ్యంగ సంస్థను తక్షణమే రద్దు చేయాలని, సరైన పక్రియ ద్వారా ప్రక్షాళన చేసి పునర్వ్యవస్థీకరణ జరపాలని డిమాండ్ కూడా చేశారు. రాజ్యాంగ సంస్థలు అందరి విషయంలో సమన్యాయంతో వ్యవహరించాల్సిన బాధ్యత వుంది. ఒక రాజకీయ పార్టీకున్న మొత్తం నియంత్రణను సమూలంగా తీసేసి ఇతరులకు అప్పచెప్పడం అన్నది ఎన్నికల సంఘం నిర్ణయంగా ఉండరాదు. భారత ప్రజాస్వామ్యం పదికాలాలపాటు పటిష్టంగా నిలదొక్కుకోవాలంటే రాజ్యాంగ

వ్యవస్థలు పటిష్టంగా పనిచేయాలి. నిష్పాక్షికంగా నిర్ణయాలు తీసుకోవాలి. అధికారంలో ఉన్న సమయంలో అధికార పార్టీకి కొమ్ముకాసే విధంగా ఉండరాదు. ఇది ఒక్క కేంద్రం విషయంలో మాత్రమే జరగడం లేదు. రాష్ట్రాల్లో నూ ఇలాగే వ్యవస్థలను భ్రష్టు పట్టిస్తున్నారు. కేంద్రాన్ని విమర్శిస్తున్న ప్రాంతీయ పార్టీల నేతలు తాము అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో కూడా అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారు. కేంద్రంలో అధికారంలో ఏ పార్టీ ప్రభుత్వం ఉంటే అవి రాజకీయ జోక్యంతో రాజ్యాంగ సంస్థలను తమ గుప్పిట్లో పెట్టుకుంటు న్నాయి. అందుకే రాజ్యాంగ సంస్కరణలు రావాలని కొందరు మేధావులు కోరు కుంటున్నారు. ప్రధానంగా వివిధ దర్యాప్తు సంస్థలు, ఎన్నికల సంఘం,ప్రణాళికా సంఘం అంటే నీతి ఆయోగ్, యూనియన్ పబ్లిక్ సర్వీస్కమిషన్, కంప్ట్రోలర్ అండ్ ఆడిట్జనరల్ వంటి అనేక సంస్థలు జవాబు దారీగా ఉండేలా పటిష్ట రాజ్యాంగం అవసరం. దేశ సమాఖ్య విధానంలో సహకార స్ఫూర్తిని పెంపొందించాల్సిన కేంద్రం అందుకు భిన్నంగా వ్యవహరిస్తోంది. భారత రాజ్యాంగ సంస్థల పట్ల విశ్వసనీయత పెరగాలి. అవి తీసుకునే నిర్ణయాలు ఏకపక్షంగా ఉండకుండా చూసుకోవాలి. అందుకు దేశవ్యాప్తంగా చర్చచేయాలి. రాజ్యాంగాన్ని అడ్డం పెట్టుకుని స్వారీ చేసే పాలకుల తీరు మారాలి. ఇలాంటి పాలకులు వస్తారని బహుశా రాజ్యాంగ రచన చేసిన వారు ఊహించ ఉండరు. అందువల్ల వ్యవస్థలను బలోపేతం చేస్తూ..రాజకీయజోక్యం లేని పాలనా సంస్థల ను రూపొందించుకోవాలి. కేంద్రంలో లేదా రాష్ట్రంలో అధికరాంలో ఉన్న పార్టీలు తమ అవసరాలకు వాటిని దుర్వినియోగం చేసే విధానాలకు చెక్ పెట్టాల్సిన అసవరం ఏర్పడింది. ప్రజలు అప్రమత్తంగా లేకుంటే పాలకులు స్వారీ చేస్తారని ప్రజలు గుర్తించాలి. ఇలా ప్రజలు నిద్రలో ఉన్నంత కాలం పాలకుల తమ విధానాలనే రుద్దుతారు. తాము చేసిందే కరెక్ట్ అని చెబుతారు. దీనిని అడ్డుకోవడం అన్నది ప్రజలు తమ కర్తవ్యంగా గుర్తించాలి. తాము అప్పగించిన అధికారం దుర్వినియోగం కాకుండా చూసుకోవాలి.

పృధ్విరాజ్ గోసుకొండ
ఎడిటర్

# మోడీ వ్యతిరేక మిషన్ బలపడుతుంది

బిజెపికి ఇక నూకలు చెల్లినట్లే ● ప్రజల నమ్మకాన్ని కోల్పోయిన మోడీ ● బిఆర్ఎస్ ప్రత్యామ్నాయ రాజకీయాలపై కడియం



వరంగల్,ఫిబ్రవరి 28 (సమ సమాజం): కేంద్రంలో మోడీకి వ్యతిరేకంగా మిషన్ మొదలయ్యిందని...ఇక బిజెపి ఆటలు సాగవని టిఆర్ఎస్ నేత, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి అన్నారు. కెసిఆర్ నాయకత్వంలోని బిఆర్ఎస్ ఇక ప్రత్యామ్నాయ రాజకీయ వేదిక కాబోతున్నది అన్నారు. రాజ్యాంగ వ్యవస్థలను గుప్పిట్లో పెట్టుకని అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్న మోడీకి ప్రజలు గుణపాఠం చెప్పడం ఎంతో దూరం లేదన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో మిషన్ తెలంగాణ చేపడుతారనే వార్తలు వస్తున్న నేపథ్యంలో ఆయన స్పందించారు. బిజెపి దేశానికే కాదు... తెలంగాణకు కూడా ఏమీ చేయలేదని ప్రజలు కూడా గుర్తించారని అన్నారు. అలాంటి బిజెపి బీజేపీ మిషన్ ఎలా నడుస్తుందని అన్నారు. ప్రజలు అంత అమాయకులు కాదుకదా అని అన్నారు. సీఎం కేసీఆర్ దేశం గర్వించదగ్గ స్థాయిలో అభివృద్ధి పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు. ఇక్కడి అభివృద్ధి తమకూ అవసరమని దేశ ప్రజలు గుర్తిస్తున్నారని అన్నారు. గత ఎనిమిదేండ్లలో కేంద్రం లోని బీజేపీ ప్రభుత్వం దళారీలను బాగు చేయడం మినహా ప్రజలకు చేసింది శూన్యమని విమర్శించారు. ప్రజల కోసం చేసిన ఒక్క మంచి పథకం ఏదో చెప్పాలని బీజేపీకి సవాల్ విసిరారు. దేశం మొత్తానికి తెలంగాణ రోల్ మోడల్‌గా నిలిచిందన్నారు. ఢిల్లీలోని బీజేపీ సర్కారును గద్దె దింపే కార్యక్రమం మొదలైందని కడియం వ్యాఖ్యానించారు. జాతీయ స్థాయిలో కేసీఆర్‌కు వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక బీజేపీ కుట్రలు పన్నుతున్నదని మండిపడ్డారు. కేసీఆర్‌ను రాష్ట్రానికే పరిమితం చేసేందుకు మిషన్ తెలంగాణ అని బీజేపీ అంటున్నదన్నారు. మిషన్ తెలంగాణ కార్యక్రమం చేపడితే బీజేపీకి ఉన్న పునాది కూడా పోవడం ఖాయమని హెచ్చరించారు. రాజీవ్ గాంధీ హయాంలో కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయంగా నేషనల్ ఫ్రంట్ పురుడుపోసుకోవడంలో అప్పట్లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ముఖ్యమంత్రిగా ఉన్న ఎన్టీ రామారావు ప్రధాన పాత్ర పోషించారు. ఇప్పుడు కెసిఆర్ అంతకుమించిన ప్రధాన పాత్రపోషిస్తున్నారని అన్నారు. బిఆర్ఎస్‌తో బిజెపి పునాదులు కదులుతున్నాయని అన్నారు. కాంగ్రెస్ మద్దతుతో యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వం కొంతకాలం కేంద్రంలో పనిచేసింది. నిజానికి కేసీఆర్ కేంద్ర ప్రభుత్వంతో స్నేహ సంబంధాలనే కోరుకున్నారు. అభివృద్ధికి సహకారం అందించవలసిందిగా కేంద్రంలోని బీజేపీని అభ్యర్థిచారు. కానీ బిజెపికి రాష్ట్రాలను అభివృద్ది చేయాలన్న కాంక్ష లేదన్నారు. ఈ నేపథ్యంలో కేసీఆర్ మొదలెట్టిన ప్రత్యామ్నాయ ప్రయత్నం విజయవంతం అవుతుందన్నారు. ప్రత్యామ్నాయ వేదిక అయిన బిఆర్ఎస్‌ను ఏర్పాటు చేసి మోడీని గద్దె దించేందుకు సమరశంఖం పూరించారని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి వ్యతిరేకంగా గొంతు కలుపుతున్న మహారాష్ట్ర, తమిళనాడు, పశ్చిమబెంగాల్ నేతలతో పోల్చితే తెలంగాణ సిఎం కెసిఆర్ సమర్థ నేత అని అన్నారు. నరేంద్ర మోదీ వ్యతిరేక ఉద్యమానికి కేసీఆర్ నాయకత్వం వహించడానికి ఇతరులకు అభ్యంతరాలు లేవని అన్నారు. ఇకపై తాను పూర్తి స్థాయిలో జాతీయ రాజకీయాలపైనే దృష్టి పెడతానని కేసీఆర్ ప్రకటించడంతో ఓ రకంగా బిజెపికి వణుకు పుట్టిందని అన్నారు. కెసిఆర్‌తో కలసి వచ్చే వారి సంఖ్య కూడా పెరుగుతోందని అన్నారు. బీజేపీనే మళ్లీ అధికారం లోకి వస్తే పరిస్థితి ఏమిటన్నదే ఇప్పుడు అందరిలోనూ చర్చగా మారిందన్నారు. బిజెపికి అంత సీన్ లేదని రానున్న రోజుల్లో మరింత స్పష్టత రాగలదని కడియం అన్నారు. అందుకే ఇప్పుడు ప్రతి ఒక్కరూ బిఆర్ఎస్ వైపు చూస్తున్నారని అన్నారు. తెలంగాణలో ప్రతిగడపకూ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని మాజీమంత్రి కడియం అన్నారు. ప్రతి ఊరిలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. ప్రజల ఆశీస్సులే ప్రభుత్వానికి అండ అని అన్నారు. అభివృద్ధి ఫలాలు అన్ని వర్గాలకు అందాలన్నది ముఖ్యమంత్రి కేసీఆర్ ఆకాంక్ష అని కడియం తెలిపారు.

## ప్రజలకు మరింత చేరువగా డిజిటల్ సేవలు

(మొదటి పేజీ తరువాత) న్స్ కాస్ట్‌లను తొలగించిందని చెప్పారు. విద్య, వైద్యం, వ్యవసాయం వంటి అనేక రంగాల్లో 5జీ, కృత్రిమ మేధాశక్తి వంటి టెక్నాలజీల వల్ల పెను మార్పులు వస్తాయన్నారు. ప్రజల జీవితాల్లో నాణ్యమైన మేలు రకపు మార్పులను తీసుకొచ్చే విధంగా టెక్నాలజీని వినియోగిస్తున్నట్లు తెలిపారు. పన్ను విధింపు, చెల్లింపు, మదింపు విధానాలను సంస్కరించినట్లు తెలిపారు. వ్యక్తులు సుదూరంగా ఉంటూ, ప్రత్యక్షంగా హాజరవ్వాల్సిన అవసరం లేకుండా పని చేసేలా దీనిని తీర్చిదిద్దినట్లు తెలిపారు. పన్ను చెల్లింపుదారులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికి ఈ విధానాలు ఉపయోగపడతాయన్నారు. ఒక దేశం-ఒకే రేషన్ పథకానికి కూడా ప్రాతిపదిక టెక్నాలజీయేనని చెప్పారు.

## డీజీ సునీల్ కుమార్‌పై కఠిన చర్యలు తీసుకోవాలి

డీజీపీ రాజేంద్రనాథ్ రెడ్డికి ఎంపీ రఘురామ లేఖ



ఢిల్లీ,ఫిబ్రవరి 28 (సమ సమాజం): డీజీ సునీల్ కుమార్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని ఏపీ డీజీపీ రాజేంద్రనాథ్ రెడ్డికి ఎంపీ రఘురామ కృష్ణంరాజు లేఖ రాశారు. సునీల్ కుమార్ సర్వీస్ రూల్స్‌ను అతిక్రమించారని పేర్కొన్నారు. అంబేద్కర్ ఇండియా మిషన్ వేదికలపై విద్వేషపూరిత ప్రసంగాలను చేశారని ఆరోపించారు. సునీల్ కుమార్‌పై సొంత భార్య గృహహింస చట్టం కింద కేసు కూడా పెట్టారని గుర్తుచేశారు. సునీల్ కుమార్ మామ కూడా కేసు పెట్టారని లేఖలో పొందిపరిచారు. సునీల్ కుమార్ అవినీతికి పాల్పడి ఆదాయానికి మించి ఆస్తులు సంపాదించారని తెలిపారు. సునీల్ కుమార్ అక్రమాలపై విచారించేందుకు సీనియర్ అధికారులతో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సునీల్ కుమార్ అవినీతికి సంబంధించి తన వద్ద తగినన్ని ఆధారాలున్నాయని వెల్లడించారు. ఢిల్లీకి వస్తే తన వద్ద ఉన్న ఆధారాలను ఇస్తానని ఎంపీ రఘురామ స్పష్టం చేశారు.

## తెలంగాణ సంక్షేమ పథకాలు దేశానికి ఆదర్శం



పల్లె ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత


దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్

నల్లగొండ,ఫిబ్రవరి 28 (సమ సమాజం): దేశంలోని ఏ రాష్ట్రాల్లో లేని విధంగా తెలంగాణలో గ్రామాల అభివృద్ధికి బీఆర్ఎస్ ప్రభుత్వం భారీగా నిధులు విడుదల చేస్తుందని దేవరకొండ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. ' మన ఊరు -మన ప్రభుత్వం-మన పథకాలు' కార్యక్రమంలో భాగంగా చందంపేట గ్రామంలో రూ. 2. 52కోట్ల అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ..ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శమని అన్నారు. పల్లె ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని పేర్కొన్నారు. వైకుంఠ ధామాలు, ప్లలె ప్రకృతి వనాలు, సీసీ రోడ్ల నిర్మాణం, చెత్త సేకరణ కోసం ట్రాక్టర్లను ప్రభుత్వం అందజేస్తున్నదని వెల్లడించారు. ప్రతీ గ్రామంలో రైతులను విజ్ఞానవంతులుగా చేసేందుకు రైతు వేదికలను ప్రభుత్వం నిర్మించిందని తెలిపారు. తెలంగాణలో అన్ని వర్గాలకు మంచి చేయడమే బీఆర్ఎస్ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. డిండి ప్రాజెక్టు నీరు చందంపేట, నేరడుగొమ్ము మండలాల చెరువులు నింపిన ఘనత తెలంగాణ ప్రభుత్వానిదేనని అన్నారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అందజేస్తున్న రైతు బంధు, రైతు బీమా, 24 గంటల ఉచిత విద్యుత్ పథకాల గురించి గ్రామస్తులకు అవగాహన కల్పించాలని కార్యకర్తలను సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల ఫోరం అధ్యక్షుడు దొండేటి మల్లా రెడ్డి, సర్పంచ్ గోసుల కవిత,రైతు బంధు అధ్యక్షుడు బోయపల్లి శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎంపీపీ ఏర్పుల గోవింద్ యాదవ్, రమావత్ మోహన్ కృష్ణ, ఎంపీడీవో రాములు నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## భైంసాలో షరతులతో ఆర్ఎస్ఎస్ ర్యాలీకి అనుమతి

హైదరాబాద్,ఫిబ్రవరి 28 (సమ సమాజం): భైంసాలో ఆర్ఎస్ఎస్ ర్యాలీకి హైకోర్టు షరతులతో కూడిన అనుమతి ఇచ్చింది. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా కార్యక్రమం నిర్వహించాలని ఆదేశించింది. ర్యాలీలో కేవలం 500 మంది మాత్రమే పాల్గొనాలని హైకోర్టు స్పష్టం చేసింది. మసీదుకు 300 దూరంలో మాత్రమే ర్యాలీలో పాల్గొనాలన్న హైకోర్టు.. ఎలాంటి క్రిమినల్ హిస్టరీ లేని వారు మాత్రమే కార్యక్రమంలో పాల్గొనేలా చూడాలని చెప్పింది. ర్యాలీ నిర్వహించే ప్రాంతంలోని మసీదు వద్ద ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసులను ఆదేశించింది. ఈ కార్యక్రమంలో పాల్గొనే వారెవరూ ఎలాంటి వివాదాస్పద వ్యాఖ్యలు చేయకూడదని హైకోర్టు తేల్చిచెప్పింది.

## వచ్చే ఎన్నికల్లో 175 సీట్లలో పోటీ చేసే దమ్ము ఉందా?



చంద్రబాబు వస్తున్నడంటే కరువు రెడీగా ఉంటుంది

దత్తపుత్రుడితో కలసి వస్తున్న చంద్రబాబు ఏం చేశాడు

తెనాలిలో రైతుభరోసా కార్యక్రమంలో సిఎం జగన్ సవాల్



గుంటూరు,ఫిబ్రవరి 28 (సమ సమాజం): ప్రజలకు మంచి చేశాం కాబట్టే మళ్లీ అధికారంలోకి వస్తామనే నమ్మకం తమకు ఉందని ఏపీ సీఎం జగన్ అన్నారు. వచ్చే ఎన్నికల్లో చంద్రబాబు, దత్తపుత్రుడికి 175 స్థానాల్లో పోటీ చేసి గెలిచే ధైర్యముందా? అని ఈ సందర్భంగా ఆయన సవాల్ విసిరారు. తమది పేదల ప్రభుత్వమని.. చంద్రబాబుది పెత్తందారీ పార్టీ అని జగన్ వ్యాఖ్యానించారు. గుంటూరు జిల్లా తెనాలిలో 'వైఎస్సార్ రైతుభరోసా' నిధుల విడుదల కార్యక్రమంలో సీఎం మాట్లాడారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన వాటిలో 98.5 శాతం హామీలను అమలు చేశామని జగన్ చెప్పారు. అందుకే తమ పార్టీ ఎమ్మెల్యేలు ధైర్యంగా 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో తిరుగుతున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో కరవుతో ఫ్రెండ్‌షిప్ ఉన్న చంద్రబాబు, వరుణ దేవుడి ఆశీస్సులున్న మనందరి ప్రభుత్వానికి మధ్య యుద్ధం జరగనుంది. ఆ యుద్ధం కులాల మధ్యకాదు.. పేదలు, పెత్తందార్ల మధ్య. పొరపాటు జరిగితే రాజకీయాల్లో ఇచ్చిన మాటపై నిలబటం అనేదానికి అర్థమే లేకుండా పోతుంది. మాట ఇచ్చి దాన్ని నిలబెట్టుకోలేకపోతే ఆ వ్యక్తి రాజకీయాల్లో కొనసాగేందుకు అర్హుడు కాదు అనే పరిస్థితి రావాలి. అందుకే ఇచ్చిన హామీల్లో 98.5 శాతం అమలు చేశామని గర్వంగా చెబుతున్నానని అన్నారు. మంచి జరిగిందని అనిపిస్తే తోడుగా ఉండాలని మాత్రమే కోరుతున్నా. అన్నీ గమనించి నిర్ణయం తీసుకునే ముందు ఆలోచించండి. మీ ఇంట్లో మంచి జరిగిందా? లేదా? అనేదే ప్రామాణికంగా తీసుకోండని జగన్ కోరారు. మూడో విడత రైతు భరోసా నిధులు విడుదల చేశారు. పంట నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ పంపిణీ చేశారు. రైతులు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందన్నారు. వరుసగా నాలుగో ఏడాది రైతు భరోసా నిధులు ఇస్తున్నారన్నారు. ఈ నాలుగేళ్లలో రాష్ట్రంలో ఎక్కడా కరువు మాటే లేదన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఎక్కడ చూసినా కరువే ఉండేదన్నారు. మేం వచ్చాక ఎక్కడా కరువు మండలం ప్రకటించే అవసరం రాలేదన్నారు.చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు అంతా కరువు పరిస్థితులేనని జగనేనన్నారు. చంద్రబాబు ప్రభుత్వం వచ్చినప్పుడల్లా కచ్చితంగా కరువు వస్తుందన్నారు. కరువుకు కేరాఫ్ అడ్రస్‌గా చంద్రబాబు మారారని జగన్ పేర్కొన్నారు. ఆర్బీకే విధానం ద్వారా రైతులకు అండగా నిలుస్తున్నామన్నారు. రైతులకు మేలు చేస్తుంటే టీడీపీకి కడుపు మండుతోందన్నారు. టీడీపీ కడుపు మంటకు మందే లేదన్నారు. దోచుకో.. పంచుకో.. తినుకో.. అనేలా టీడీపీ పాలన ఉంటుందని జగన్ విమర్శించారు.

## తప్పుడు కేసులపై జ్యుడిషల్ విచారణ

దొంగకేసులతో లొంగదీసుకునే యత్నాలు

యువగళంపాదయాత్రలో నారాలోకేశ్



తిరుపతి, ఫిబ్రవరి 28 (సమ సమాజం): తప్పుడు కేసులపై జ్యుడిషల్ విచారణ చేయిస్తామని టిడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. బీసీలపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ దొంగ కేసులు పెట్టి లొంగ తీసుకోవాలని చూస్తున్నారన్నారు. మేము ప్రభుత్వంలోకి రాగానే జ్యూడిషరీ ఎంక్వయిరీ చేసి ఇలాంటి తప్పుడు కేసులు పెట్టినవారిని డిస్మిస్ చేస్తామన్నారు. పాదయాత్రకు అడుగడుగునా అడ్డంకులు ఎదురవుతున్నాయి. చంద్రగిరి, మామండూరు దగ్గర యువగళం పాదయాత్ర ప్లెక్సీలను రెవెన్యూ అధికారులు తొలగించారు. అదేమంటే.. ఎన్నికల కోడ్ ఉందని ప్లెక్సీలు తొలగించామని అధికారులు చెబుతున్నారు. యువగళం ప్లెక్సీల తొలగింపుపై టీడీపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వంపై తిరుగుబాటు చేయకపోతే బతకలేమని నారా లోకేష్ పేర్కొన్నారు. నేడు యువగళం పాదయాత్రలో భాగంగా ఆయన రజకులతో ముఖాముఖి నిర్వహించారు. తమ పార్టీ అధికారంలోకి వచ్చాక నిత్యవసర వస్తువుల ధరలు తగ్గేందుకు కేరళ తరహాలో ప్రత్యేక నిధిని ఏర్పాటు చేస్తామన్నారు. 1983 తర్వాత ఎన్టీఆర్ ముఖ్యమంత్రి అయిన తర్వాతనే మంత్రి పదవిలో బీసీల సంఖ్య పెరిగిందని నారా లోకేష్ పేర్కొన్నారు. పది సంవత్సరాల్లో ఏపీలో పేదరికం లేకుండా చేస్తామన్నారు. రజకులను ఎస్సీలుగా రిజర్వేషన్లు కల్పించటం సత్యపల్ కమిటీ నివేదిక ఆధారంగా పక్రియ కొనసాగిస్తామన్నారు. తిరుపతిలో రజకుల భవనానికి వంద రోజుల్లో భూమి కేటాయిస్తామన్నారు. బీసీల రక్షణకు ప్రత్యేక చట్టాన్ని తీసుకొస్తామన్నారు. దోబీ ఘాట్‌లో గదులు నిర్మిస్తామని.. ఆధునికరణ చేస్తామన్నారు. ధోబిఘాట్‌లో గతంలో టీడీపీ ఉచిత విద్యుత్ ఇచ్చేదని... జగన్ రాగానే బిల్లులు బాదుడు మొదలైన్నారు. టీడీపీ మళ్లీ అధికారంలోకి రాగానే దోబీ ఘాట్లకు ఉచిత విద్యుత్ ఇస్తామని నారా లోకేష్ హామీ ఇచ్చారు. అలాగే తిరుమలలో ధోబిఘాట్లలో రజకులకే అవకాశాలు కేటాయిస్తామన్నారు.

## చిట్యాలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం




మిత్రులతో అనుబంధం పంచుకున్న గుత్తా

నల్లగొండ,ఫిబ్రవరి 28 (సమ సమాజం): చిట్యాలలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1969-70 పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంలో శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి తన మిత్రులతో కలిసి సందడి చేశారు. ఈ సందర్భంగా గుత్తా సుఖేందర్ రెడ్డి విద్యార్థి జీవితానికి సంబంధించిన జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. మండలి చైర్మన్ హోదాలో ఉన్న గుత్తా సుఖేందర్ రెడ్డి.. తన స్నేహితులతో కలిసిపోయి, అందర్నీ ఆప్యాయంగా పలుకరించారు. వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అందరూ కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. తమకు చదువు చెప్పిన ఐదుగురు ఉపాధ్యాయులను ఆహ్వానించగా, ముగ్గురు హాజరయ్యారు. ఆ ముగ్గురు ఉపాధ్యాయులను వారు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులంతా తమ కుటుంబాలతో కలిసి హాజరయ్యారు. మొత్తం 44 మందికి గానూ ఇప్పటికే 9 మంది చనిపోయారు. మిగిలిన 35 మంది గెట్ టు గెదర్‌కు హాజరయ్యారు.

## భార్య మరణంతో భర్త ఆత్మహత్య

జనగామ,ఫిబ్రవరి 28 (సమ సమాజం): భార్య మరణం జీర్ణించుకోలేక ఓ భర్త, భార్య సమాధి పక్కన ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన జనగామలో చోటు చేసుకుంది. జిల్లాలోని స్టేషన్ ఘన్‌పూర్‌లో తాటి రాజు (40) అనే రైల్వే ఉద్యోగి భార్య ఆరు నెలల క్రితం చనిపోయింది. అనంతరం ఆయన మరో పెళ్లి చేసుకున్నాడు. మొదటి భార్య మరణాన్ని మరచిపోలేక తీవ్రంగా మనస్థాపానికి గురై రాజు ఆమె సమాధి వద్దకు వెళ్లి పురుగుల మందు తాగాడు.దీంతో తీవ్ర అస్వస్థకు గురై అక్కడికక్కడే ప్రాణాలు వదిలాడు. మంగళవారం సమీప ప్రజలు గమనించి పోలీసులకు సమాచారం అందించడంతో విషయం వెలుగులోకి వచ్చింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు.

# భారీగా పెరిగిన విద్యుత్ డిమాండ్



(మొదటి పేజీ తరువాత) కరెంటు వినియోగానికి మరింత డిమాండ్ ఉండే అవకాశం ఉందని ట్రాన్స్‌కో అధికారులు భావిస్తున్నారు. పెరిగిన సాగు విస్తీర్ణం, పారిశ్రామిక అవసరాల వల్ల డిమాండ్‌కు కారణాలు పేర్కొంటున్నారు. అయితే, మొత్తం విద్యుత్ వినియోగంలో వ్యవసాయానికే 37శాతం వినియోగిస్తున్న రాష్ట్రంగా నిలిచిందని అధికారులు తెలిపారు. ఇంతకు ముందు వ్యవసాయానికే కేవలం 35శాతమే వినియోగించే వారని పేర్కొంటున్నారు. వేసవికాలం సమీపిస్తుండడంతో డిమాండ్ పెరిగి 37శాతానికి పెరిగినట్లు అంచనా వేస్తున్నారు. తెలంగాణవ్యాప్తంగా పంటలకు నీటిని అందించడం పెరిగిందని, అలాగే ఉద్యాన పంటలకు సైతం నీటి వాడకం ఎక్కువైందని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో బోరుబావులపైనే ఆధారపడి రైతులు పంటలు సాగు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో విద్యుత్ డిమాండ్ ఎక్కువైందని అధికారులు పేర్కొంటున్నారు. రబీ సీజన్‌లో దాదాపు 16వేల మెగావాట్లకుపైగా డిమాండ్ వచ్చే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు. డిమాండ్ ఎంత వచ్చినా నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేస్తామని అధికారులు స్పష్టం చేస్తున్నారు. రాష్ట్ర చరిత్రలోనే అత్యధిక విద్యుత్ వినియోగం నమోదయిందని ట్రాన్స్‌కో జెన్కో సీఎండీ ప్రభాకర్ రావు తెలిపారు. ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడినప్పటి నుంచి తెలంగాణలో తొలిసారిగా రికార్డ్ స్థాయిలో ఇవాళ విద్యుత్ డిమాండ్ నమోదు కావటం విశేషమన్నారు. సాగు విస్తీర్ణం పెరగడం, రాష్ట్రంలో పారిశ్రామిక అవసరాలు పెరగడంతో విద్యుత్ వినియోగం పెరుగుతోందన్నారు. గతేడాది మార్చిలో 14,160 మెగా వాట్ల అత్యధిక విద్యుత్ వినియోగం కాగా..ఈ సారి డిసెంబర్ లోనే ఆ రికార్డ్ ను అధిగమించి 14,501 మెగా వాట్ల విద్యుత్ నమోదయ్యిందని అన్నారు. మొత్తం విద్యుత్ వినియోగంలో సౌత్‌లో తమిళనాడు మొదటి స్థానంలో ఉండగా తెలంగాణ రెండో స్థానంలో ఉందని సీఎండీ ప్రభాకర్ రావు తెలిపారు. మొత్తం విద్యుత్ వినియోగంలో 37 శాతం వ్యవసాయ రంగానికే వాడుతున్నారని చెప్పారు. దేశంలో వ్యవసాయ రంగానికి అత్యధిక విద్యుత్ వినియోగిస్తున్న రాష్ట్రం తెలంగాణ అని చెప్పారు. డిమాండ్ ఎంత వచ్చినా 24 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తామన్నారు.

# దేశంలో అగ్రభాగాన సిరిసిల్ల బిడ్డలు



(మొదటి పేజీ తరువాత) చేయకండి. వేరే విషయం కాదు. మంచిగా చదువుకొని ఐఐటీ, నీట్ ఎంట్రెన్స్‌లతో పాటు ఇతర రంగాల్లో మంచి ర్యాంకులు సాధించండి. ప్రపంచంతో పోటీ పడే పౌరులుగా తయారు కావాలనే ఉద్దేశంతోనే మీకు ఈ ట్యాబ్‌లు అందజేస్తున్నాం. వేములవాడ నియోజకవర్గానికి కూడా తప్పకుండా 3 వేల ట్యాబ్‌లు అందిస్తాం. రాష్ట్ర, దేశ స్థాయిలో మంచి ర్యాంకులు సాధిస్తే తమకు తృప్తి కలుగుతుంది అని కేటీఆర్ పేర్కొన్నారు. గిఫ్ట్‌ఏ స్మైల్ కార్యక్రమంలో భాగంగా చిన్నారి తమ్ముళ్లు, చెల్లెళ్ల ముఖాల్లో చిరునవ్వులు చూడాలని ఆకాష్ బై జూస్ సాఫ్ట్‌వేర్ ట్యాబ్‌లను పంపిణీ చేస్తున్నాం అని కేటీఆర్ తెలిపారు. ఈ ట్యాబ్‌ల ద్వారా పోటీ పరీక్షలకు ఉపయోగపడే మెటీరీయల్‌ను అందజేస్తున్నాం. బయట కంటే ఈ ట్యాబ్ విలువ రూ. 10 వేలు అవుతుంది. మెటీరీయల్ విలువ రూ. 75 వేలు అవుతుంది. అంటే ఒక్కో ట్యాబ్ విలువ రూ. 86 వేలు.. దీన్ని ఉచితంగా మీ చేతుల్లో పెడుతున్నాం. మీరు బాగా చదువుకుంటే.. మేమంతా సంతోషపడుతాం. గర్వపడుతాం అని కేటీఆర్ స్పష్టం చేశారు. జిల్లాలోని పాఠశాలలను రాష్ట్రానికే ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నాం. కార్పొరేట్ పాఠశాలల కంటే మెరుగ్గా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దబోతున్నాం అని పేర్కొన్నారు. మన ఊరు మన బడి కార్యక్రమం కింద గంభీరావుపేటలో కేజీ టు పీజీ క్యాంపస్‌ను ప్రారంభించుకున్నాం. రాబోయే రోజుల్లో 26 వేల ప్రభుత్వ పాఠశాలలను అద్భుతంగా తీర్చిదిద్దడంతో పాటు ఇంగ్లీష్ మీడియంలో బోధన అందిస్తామన్నారు. విద్యా వ్యవస్థలో మార్పులు తీసుకువస్తున్నాం అని కేటీఆర్ స్పష్టం చేశారు.ఎల్లారెడ్డిపేట పాఠశాల రూ. 7 కోట్లతో అద్భుతంగా తయారవుతోంది అని మంత్రి కేటీఆర్ తెలిపారు. రాబోయే 2, 3 నెలల్లోనే ఆ పాఠశాలను ప్రారంభిచుకుందాం అని చెప్పారు. పాఠశాల గొప్పగా తయరవుతోంది. కానీ జూనియర్ కాలేజీ గ్రౌండ్ అనుకున్నట్టు లేదు. ఈ గ్రౌండ్‌ను మినీ స్టేడియంగా తీర్చిదిద్దుతాం అని స్పష్టం చేశారు. వేణుగోపాలస్వామి ఆలయాన్ని రూ. 2 కోట్లతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతాం అని చెప్పారు.

## నేడు జాతీయ విజ్ఞాన దినోత్సవం



**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 28 (సమ సమాజం):** ఏటా ఫిబ్రవరి 28 ను జాతీయ విజ్ఞాన దినోత్సవంగా జరుపుకుంటున్నాం. భారతదేశం 1986లో ఈ రోజును జాతీయ విజ్ఞాన దినంగా అంగీకరించింది. చంద్రశేఖర్ వెంకటరామన్ 'రామన్ ఎఫెక్ట్' కనుగొన్న రోజైన ఫిబ్రవరి 28 (1928) జ్ఞాపకార్థం జాతీయ విజ్ఞాన దినోత్సవంగా ప్రభుత్వం ప్రకటించింది. రామన్ ప్రభావం ఏంటంటే.. సముద్రపు నీటిపై సూర్యకాంతి పడినప్పుడు ఆ కాంతిలోని నీలం రంగు ఎక్కువగా పరిక్షేపం చెంది మన కంటికి చేరడం వల్లనే సముద్రం నీలంగా కనిపిస్తుందని సి.వి.రామన్ సిద్ధాంతీకరించాడు. ఇలా ద్రవాలపై పడిన కాంతి కిరణాలు ఎలా పరిక్షేపం చెందుతాయో తెలిపే పరిశోధన ఫలితాన్నే రామన్ ప్రభావం అంటారు. కాంతి కిరణాలు ఒక ద్రవ పదార్థంపై పడినప్పుడు ఆ కాంతి పరిక్షేపం చెందుతుంది. అంటే కాంతి కిరణాల్లోని ఫోటాన్ కణాలు, ద్రవ పదార్థాల పరమాణువులపై పడి పరిక్షేపం చెందుతాయి. చాలా ఫోటాన్లు పడేటప్పటి పౌనఃపున్యంలోనే చెదిరిపోతే, కొన్ని ఫోటాన్లు మాత్రం అంతకు తక్కువ పౌనఃపున్యంతో పరిక్షేపం చెందుతాయి. అంటే పడిన కాంతిలో కొంత భాగం మాత్రం వేరే పౌనఃపున్యంతో చెదురుతుంది. ఇదే రామన్ ఎఫెక్ట్. దీన్ని కనుగొన్నందుకు ఆయన 1930లో నోబెల్ బహుమతిని అందుకున్నారు. అందుకు జ్ఞాపకంగా, గౌరవంగా ఉండేందుకు జాతీన విజ్ఞాన దినోత్సవాన్ని జరుపుకుంటాం.

# సమస్యలు తెలుసుకోవడానికే ఈ పాదయాత్ర

**37వ రోజుకు చేరుకున్న ప్రగతి నివేదన యాత్ర**

**మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి**



**రంగారెడ్డి, ఫిబ్రవరి 28 (సమ సమాజం):** రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఆదిభట్ల మున్సిపాలిలోని కొంగరకలాన్ గ్రామానికి ప్రగతి నివేదన యాత్ర చేరుకోవడం జరిగింది. కొంగరకలాన్ చౌరస్తాలో నిర్వహించిన బహిరంగ సభలో ముఖ్యఅతిథిగా బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నడూ లేని విధంగా కోట్ల రూపాయలతో కొంగరకలాన్ సంక్షేమ, అభివృద్ధిపనుల కోసంసుమారు 120.26కోట్లు ఖర్చు చేసాము కాబట్టే మీ ముందు ధైర్యంగా మాట్లాడుతున్నానని పేదల కష్టాలు శాశ్వతంగా తొలగించేందుకే కేసీఆర్ రూపకల్పన చేశారని, ఇంటింటికి మంచినీటి నల్లా ఏర్పాటు చేయడంతో మహిళల కష్టాలు తీరాయని త్వరలో పంట రుణాల మాఫీ, ఇళ్ల నిర్మాణం కోసం 3 లక్షల ఆర్థిక సహాయాన్ని, బస్తీ దవాఖానాలో ఏర్పాటు చేసి అందరికీ అందుబాటులో వైద్య సేవలు అందించాలని లక్ష్యంతో ముఖ్యమంత్రి కెసిఆర్ పనిచేస్తున్నారని చెప్పారు. సొంతూరు ఎలిమినేడు ఎంత ముఖ్యమో, కొంగరకలాన్ కూడా అంతే ముఖ్యమని కలెక్టర్ కార్యాలయం వేరే చోట నిర్మిస్తామంటే సీఎం కేసీఆర్ ని మెప్పించి, ఒప్పించి రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని ఇబ్రహీంపట్నం ప్రాంతానికి తీసుకురావడం జరిగిందని ఇప్పుడు గ్రామం మరింత అభివృద్ధి చెందుతుందని కలెక్టర్ కార్యాలయం నిర్మాణం కోసం 58.20 కోట్లు, నాదర్గుల్ నుంచి మంగళపల్లి రోడ్ల విస్తరణ పనుల కోసం 11 కోట్లు, సీసీ రోడ్లు,డ్రైనేజీ నిర్మాణం కోసం 3.90కోట్లు, కొంగర నుంచి మీర్ ఖాన్ పేట వరకు సీసీ రోడ్లు, బీటీ రోడ్డు తుర్కగూడ వరకు 4.75కోట్లు కొంగరకలాన్ లో సీసీ రోడ్లు అండర్ డ్రైనేజ్, మిషన్ భగీరథ, సాగునీటి పైప్లైన్,మిషన్ కాకతీయ ద్వారా చెరువుల మరమ్మత్తులు, పూడికతీత అన్ని అభివృద్ధి కార్యక్రమాల కోసం సుమారు 16.71 కోట్ల రూపాయలు ఖర్చు చేస్తుందని అన్నారు. ప్రతినెల సుమారు 710 మందికి వివిధ రకాల పెన్షన్ల కోసం దాదాపు 15.79 లక్షలు, రైతు బంధు పథకం ద్వారా 1120మంది రైతులకు 1.10 కోట్లు, రైతు బీమా 10 మంది రైతులకు 50 లక్షలు, సీఎంఆర్ పథకం నుంచి 66 మందికి 34.58 లక్షలు, కళ్యాణ లక్ష్మి,షాదీ ముబారక్ 188 మందికి 1.72కోట్లు, కేసీఆర్ కిట్లు 304 మందికి దాదాపు 45.60 లక్షలు అన్యాయం తెలియజేశారు.ఈ కార్యక్రమంలోరంగారెడ్డి గ్రంథాలయ చైర్మన్ సత్తువెంకటరమణ రెడ్డి,బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు క్యామ మల్లేష్, ఆదిబట్ల కౌన్సిలర్స్, బీఆర్ఎస్ నాయకులు పెద్ద ఎత్తున గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## యాదాద్రిలో వైభవంగా బ్రహ్మోత్సవాలు



(మొదటి పేజీ తరువాత) పలువురు మంత్రులు పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పిస్తారు. ఇప్పటికే అధికారులు ఏర్పాట్లను పూర్తిచేశారు. అంతకుముందు స్వామి, అమ్మవార్ల ఎదుర్కోలు మహోత్సవం ఘనంగా నిర్వహించారు. స్వామి అమ్మవార్లను ప్రత్యేక అలంకారంలో ఆలయ మాఢవీధుల్లో ఊరేగించి, తూర్పు రాజగోపురం ముందు ఎదురెదురుగా అధిష్టింపజేసి ఎదుర్కోలు తంతును నిర్వహించారు. స్వామి తరపున ఆలయ ఈవో గీతారెడ్డి, అమ్మవారి తరపున ఆలయ చైర్మన్ నర్సింహమూర్తి, మరికొంత మంది అర్చకులు పెండ్లి పెద్దలుగా ఉండి ఎదుర్కోలు తంతును నిర్వహించారు.

# మనీష్ సిసోడియాకు సుప్రీంలో చుక్కెదురు



(మొదటి పేజీ తరువాత) విచారణ జరిపిన సుప్రీంకోర్టు.. దీనిపై తదుపరి విచారణకు నిరాకరించింది. ఢిల్లీ లిక్కర్ స్కాం కేసు అవినీతి కిందకు వస్తుందని సుప్రీంకోర్టు పేర్కొంది. దీనిపై ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించాలని సూచించింది. ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో సీబీఐ తనపై చేసిన ఆరోపణలతో తనకు ఎలాంటి సంబంధం లేదని సిసోడియా సుప్రీంకోర్టుకు తెలిపారు. ఈ కేసు విచారణపై స్టే ఇచ్చి..తనకు బెయిల్ మంజూరు చేయాలని కోరారు. అయితే సుప్రీంకోర్టు దీనికి నిరాకరించింది. మనీశ్ సిసోడియా పిటిషన్‌పై మంగళవారం మధ్యాహ్నంసుప్రీంకోర్టు విచారణ జరిపింది. 30 నిమిషాల విచారణ తర్వాత కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ కేసుపై తాము తాము విచారణ చేయబోమని సిసోడియాకు సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. ఈ కేసు అవినీతి కిందకు వస్తుంది కాబట్టి...ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించాలని సూచించింది. అయితే గతంలో వినోద్ దువా కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును సిసోడియా తరపు లాయర్ అభిషేక్ మనుసింఘ్వీ ప్రస్తావించారు. దీనిపై స్పందించిన అత్యున్నత న్యాయస్థానం... దానికి ఈ కేసుకు సంబంధం లేదని క్లారిటీ ఇచ్చింది. మనీష్ సిసోడియాను ఆదివారం అరెస్టు చేసిన సీబీఐ.. సోమవారం కోర్టు ముందు హాజరు పర్చింది. దీంతో సీబీఐ కోర్టు సిసోడియాను 5 రోజుల సీబీఐ కస్టడీకి పంపింది. మనీష్ సిసోడియాను ఐపీసీ 120 బి, 477 ఎ, అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ 7 కింద అరెస్టు చేశారు. ఈ క్రమంలో సీబీఐ రౌస్ అవెన్యూ కోర్టు సిసోడియాకు ఐదురోజుల రిమాండ్ విధించింది. మార్చి 4 వరకు కస్టడీకి అప్పగించింది. ఢిల్లీ ప్రభుత్వ మద్యం విధాన రూపకల్పన, అమలులో అవకతవకల వ్యవహారంపై దర్యాప్తులో భాగంగా ఆదివారం సాయంత్రం సిసోడియాను అరెస్టు చేసింది. సోమవారం ఆయన్ను రౌజ్ అవెన్యూ కోర్టులో హాజరుపర్చారు. దర్యాప్తు సమయంలో పొంతనలేని సమాధానాలు చెప్పారని, తమ వద్ద ఉన్న ఆధారాలకు ఆయన చెబుతున్న సమాధానాలకు సరిపోలడం లేదని సీబీఐ అధికారులు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. మద్యం విధానం కోసం రూపొందించిన ముసాయిదా నోటీసుల్లో న్యాయ నిపుణుల అభిప్రాయాలను సిసోడియా తొలగించారని ఆరోపించారు. తమ ప్రశ్నలకు దాటవేత ధోరణిలో సమాధానాలు ఇస్తున్నారని తెలిపారు. ఈ కేసు దర్యాప్తు ముందుకెళ్లాలంటే ఆయన్ను ఐదు రోజుల కస్టడీకి అప్పగించాలని కోరారు. సిసోడియా తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. ఢిల్లీ ఎక్సైజ్ పాలసీలో మార్పులను లెఫ్టినెంట్ గవర్నర్ ఆమోదించారని, సీబీఐ మాత్రం ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వం వెంట పడుతోందని తెలిపారు. సిసోడియాకు వ్యతిరేకంగా ఎలాంటి ఆధారాలూ లేవన్నారు. కస్టడీకి ఇవ్వాలన్న సీబీఐ అభ్యర్థనను వ్యతిరేకించారు. అయితే ఈ కేసు విచారణ సమర్థంగా జరగాలంటే సిసోడియా కస్టడీ అవసరమని సీబీఐ తరపు న్యాయవాది తెలిపారు. తన ప్రమేయం ఏమీ లేదని సిసోడియా చెబుతున్నారని.. దర్యాప్తులో మాత్రం ఆయన వ్యక్తిగతంగా నిర్ణయాలు తీసుకున్నట్లు తేలిందని వెల్లడించారు. ఈ క్రమంలో మార్చి 4 వరకు ఆయన్ను సీబీఐ కస్టడీకి అనుమతి ఇస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఆప్ శ్రేణుల ఆందోళనల నేపథ్యంలో భారీ భద్రత నడుమ సిసోడియాను కోర్టుకు తీసుకెళ్లారు. సిసోడియా అరెస్టును నిరసిస్తూ ఆమ్ ఆద్మీ పార్టీ కార్యకర్తలు ఢిల్లీలో పెద్ద ఎత్తున ఆందోళనలకు దిగారు. సోమవారాన్ని బ్లాక్ డేగా పేర్కొన్నారు. బీజేపీ ప్రధాన కార్యాలయం ఎదుట ఆ పార్టీ కార్యకర్తలు, నేతలు ఆందోళన చేపట్టారు. ఢిల్లీ సహా పంజాబ్, ఒడిసా, జమ్మూకశ్మీర్ తదితర రాష్ట్రాలు, కొన్ని ఇతర నగరాల్లోనూ ఆప్ కార్యకర్తలు ఆందోళన చేపట్టారు. హైదరాబాద్‌లోనూ ఆప్ నాయకులు బీజేపీ కార్యాలయ ముట్టడికి యత్నించారు. సిసోడియా అరెస్టును ఖండిస్తున్నట్లు బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ ప్రకటించారు. కేంద్రంలోని బీజేపీ సర్కారు ఉద్దేశపూర్వకం గానే ఆయన్ను సీబీఐ ద్వారా అరెస్టు చేయించిందన్నారు. ఈ చర్య ప్రధాని మోదీకి, అదానీకి మధ్య ఉన్న సంబంధం నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికి చేసిందే తప్ప మరొకటి కాదన్నారు. ఢిల్లీ మద్యం కేసు వెలుగులోకి వచ్చిన తర్వాత కేసీఆర్ స్పందించడం ఇదే తొలిసారి. ఈ క్రమంలో తన అరెస్టును సిసిఓడియా సవాల్ చేస్తూ సుప్రీంలో పిటిషన్ వేయగా కోర్టు మంగగళవారం విచారించింది.

# 3,4 తేదీల్లో గ్లోబల్ ఇన్వెస్టర్స్ సదస్సు

**విశాఖలో సదస్సు కోసం భారీగా ఏర్పాట్లు**

**రెండ్రోజులపాటు విశాఖలోనే బసచేయనున్న సిఎం జగన్**



**విశాఖపట్టణం,ఫిబ్రవరి 28 (సమ సమాజం):** విశాఖలో గ్లోబల్ ఇన్వెస్టర్ల సదస్సును ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ప్రభుత్వం అందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఇన్వెస్టర్లను ఆకట్టుకునేలా ప్రణాళికలు సిద్ధం అయ్యాయి. ఆంధ్రా యూనివర్శిటీ గ్రౌండ్స్‌లో మార్చి 3,4 తేదీల్లో జరుగనున్న గ్లోబల్ ఇన్వెస్టర్స్ సదస్సుకు ఏర్పాట్లు చకచకా జరుగుతున్నాయి. అధికారయంత్రాంగం ఇప్పటికే ఏర్పాట్లలో నిమగ్నమైంది. సదస్సుకు వచ్చే పారిశ్రామిక వేత్తలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడటంతో పాటు, రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వచ్చేలా చూడటానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోంది. ఇప్పటికే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి పలుమార్లు అధికార యంత్రాంగానికి దిశా నిర్దేశం చేయగా, తాజాగా సోమవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఉనుతస్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్లోబల్ ఇన్వెస్టర్ల సదస్సును ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని ఈ సమావేశంలో ఆయన ఆదేశించారు. పరిశ్రమల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న అన్ని రకాల ప్రోత్సహాకాలకు సంబంధించి పూర్తి స్థాయి సమాచారాన్ని సిద్ధం చేసుకోవాలని చెప్పారు. 3వ తేది దయం 10 గంటలకు సదస్సు ప్రారంభం కానుంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సదస్సు జరిగే రెండు రోజులూ విశాఖలోనే ఉండనున్నట్లు సమాచారం. వివిధ పారిశ్రామిక రంగాలపై జరిగే సెషన్లలో సిఎం స్వయంగా పాల్గనడంతో పాటు, పారిశ్రామిక వేత్తలతో ఆయన నేరుగా చర్చలు జరపనున్నారు.మొదటి రోజు జరిగే విందులో కూడా సిఎం జగగన్ పారిశ్రామిక వేత్తలతో కలిసి భాగస్వాములు కానున్నారు. మార్చిలో జరగబోయే రెండు ప్రతిష్టాత్మకమైన సదస్సుల కోసం నగరంలో ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇందులో మొదటిది గ్లోబల్ ఇన్వెస్టర్స్ సదస్సు. మార్చి 3, 4 తేదీల్లో జరగనుంది. ఇందుకోసం ఏయూ ఇంజనీరింగ్ కాలేజీ మైదానంలో ఏర్పాట్లు చేస్తున్నారు. మరొకటి జీ-20 సదస్సు. మార్చి 28, 29 తేదీల్లో రుషికొండలోని రాడిసన్ బ్లూ హోటల్‌లో జరగనున్నది. రెండింటికీ దేశ, విదేశాల నుంచి అతిథులు హాజరు కానుండడంతో భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. కాబోయే రాజధాని విశాఖపట్నమేనని ఇప్పటికే ఢిల్లీలో ముఖ్యమంత్రి జగన్ ప్రకటించిన నేపథ్యంలో సుమారు రూ.120 కోట్ల వ్యయంతో నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. ప్రధాన మార్గాలకు మరమ్మతులు చేసి, డివైడర్లకు రంగులు వేస్తున్నారు. బీచ్‌రోడ్డుకు కొత్త సొబగులు అద్దుతున్నారు. కొత్తగా సాగర్‌నగర్‌లో మరో బీచ్‌ను పర్యాటకులు సందర్శించే విధంగా తయారు చేశారు. ఫుట్‌పాత్‌లన్నింటికీ రంగులు వేస్తున్నారు. కైలాసగిరిని, వీఎంఆర్‌డీఏ పార్కు, తొట్లకొండ తదితర ప్రాంతాలకు అతిథులు వెళ్లనున్నందున...ఆయా ప్రాంతాల్లో కొత్త హంగులు సమకూరుస్తున్నారు. ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో ఏర్పాట్లు బుధవారం నాటికి పూర్తికానున్నాయి. ఇవన్నీ ఏపీఐఐసీ ఆధ్వర్యంలో జరుగుతుండగా పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, కలెక్టర్ మల్లికార్జున, జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు, పోలీస్ కమిషనర్ శ్రీకాంత్ పర్యవేక్షిస్తున్నారు. అతిథుల బస, భద్రత, రవాణా సౌకర్యాలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు.

## బాలుడు ప్రదీప్ కుటుంబాన్ని ఆదుకోవాలి

**మరోమారు ట్వీట్ చేసిన దర్శరకుడు ఆర్జీవి**



**హైదరాబాద్, ఫిబ్రవరి 28 (సమ సమాజం):** కుక్కల దాడిలో మృతి చెందిన బాలుడు ప్రదీప్ కుటుంబాన్ని ఆదుకోకపోవడం దారుణమని ప్రముఖ దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ అన్నారు. అతని ప్రాణానికి విలువ లేదా అని ప్రశ్నించారు. అధికారిక హోదాలో మీరు ఏం చేయలేకపోతే.. కనీసం వ్యక్తిగత హోదాలోనైనా అంబర్‌పేట బాలుడి కుటుంబానికి సాయం చేయాలని సినీ దర్శకుడు రామ్ గోపాల్ వర్మ మేయర్ గద్వాల విజయలక్ష్మిని కోరారు. డాగ్ లవర్ అయితే సరిపోదని.. తోటి మనుషులను కూడా ప్రేమించాలని మేయర్‌ను ట్యాగ్‌చేస్తూ వర్మ ఉదయం వరుస ట్వీట్లు చేశారు. బాలుడు ప్రదీప్ కుటుంబానికి తోటి పౌరులమైన మనం కూడా చేయూతనివ్వాలని, దయ కలిగిన వారు ఎవరైనా ఉంటే ప్రదీప్ తల్లిదండ్రుల అకౌంట్‌కు డబ్బు పంపి సాయం చేయాలని నగర ప్రజలను కోరారు. కాగా ఇప్పటి వరకు సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం విస్మయం కలిగిస్తోందని ఆర్జీవీ ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు.

# ఇండోర్ వేదికగా నేటినుంచి మూడో టెస్ట్




గట్టిగా కసరత్తుచేసిన ఇరు జట్లు ● మూడో మ్యాచ్‌లో గెలుపు కోసం వ్యూహాలు

**ఇండోర్, ఫిబ్రవరి 28 (సమ సమాజం):** ఇండోర్ వేదికగా బుధవారం నుంచి బోర్డర్–గవాస్కర్ ట్రోఫీలో మూడో టెస్ట్ మ్యాచ్ జరుగనుంది. ఇందుకోసం ఇరు జట్లు నెట్ ప్రాక్టీస్ చేశాయి. ఇప్పటికే 'బోర్డర్–గవాస్కర్'ట్రోఫీలో రెండు మ్యాచుల్లోనూ ఓటమి చుసిన ఆస్ట్రేలియా.. మూడో టెస్టులో విజృంభించేందుకు కసరత్తు చేసింది. ముఖ్యంగా భారత పిచ్‌లపై స్పిన్‌ను ఎదుర్కోలేక చతికిలబడుతున్న కంగారూలు.. ఇండోర్‌లో స్పిన్ ఉచ్చును జయించేందుకు ముమ్మర సాధన చేశారు. నాలుగు మ్యాచ్‌ల సిరీస్‌లో తొలి రెండింట్లో విజయాలు సాధించిన భారత జట్టు కూడా సాధన కొనసాగించింది. ఇండోర్ వేదికగా బుధవారం నుంచి 'బోర్డర్–గవాస్కర్'సిరీస్ మూడో టెస్టు ప్రారంభం కానుండగా.. ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్ చేరడమే లక్ష్యంగా భారత జట్టు ప్రాక్టీస్ కొనసాగించింది. ఇటు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ గంటల కొద్ది నెట్స్‌లో శ్రమిస్తుంటే.. అటువైపు లబుషేన్, ఖవాజా భారత స్పిన్ త్రయాన్ని జయించేందుకు ప్రయత్నిస్తున్నారు. మరో మ్యాచ్ నెగ్గితే ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్‌కు అర్హత సాధించడంతో పాటు.. ఐసీసీ టెస్టు ర్యాంకింగ్స్‌లో రోహిత్ సేన అగ్రస్థానానికి చేరడం ఖాయమే. దీంతో మనవాళ్ళ అదే జోరు కొనసాగించాలని చూస్తున్నారు. ఇండోర్ స్టేడియంలో రవిచంద్రన్ అశ్విన్‌కు మెరుగైన రికార్డు ఉండటం ఆసీస్‌ను మరింత కలవరపెడుతున్నది. ఈ ఆఫ్‌స్పిన్నర్ ఇండోర్‌లో ఆడిన రెండు టెస్టుల్లో 12.5 సగటుతో 18 వికెట్లు పడగొట్టడం విశేషం. సిరీస్ ప్రారంభానికి ముందు అశ్విన్ బౌలింగ్‌ను ఎదుర్కొనేందుకు తమ వద్ద తగిన ప్రణాళికలు ఉన్నాయని బీరాలు పలికిన కంగారూలు.. బరిలోకి దిగాక అశ్విన్, జడేజా ధాటికి చేతులెత్తేసిన విషయం తెలిసిందే. స్పిన్‌ను సమర్థంగా ఎదుర్కోగల స్టీవ్ స్మిత్, మార్నస్ లబుషేన్‌పైనే ఆ జట్టు ఎక్కువగా ఆధారపడుతున్నది.. అది మంచి పద్ధతి కాదని ఆసీస్ మాజీలు హెచ్చరిస్తున్నారు. గాయం కారణంగా మిగిలిన రెండు మ్యాచ్‌లకు విధ్వంసక ఓపెనర్ డేవిడ్ వార్నర్ దూరం కాగా.. వ్యక్తిగత కారణాలతో స్వదేశానికి తిరిగి వెళ్లిన కెప్టెన్ కమిన్స్ మూడో టెస్టుకు అందుబాటులో లేకుండా పోయాడు. దీంతో ఇండోర్ పోరుకు స్మిత్ కంగారూల బృందానికి సారథ్యం వహించనున్నాడు. భారత స్పిన్ త్రయాన్ని ఎదుర్కొనేందుకు ప్రస్తుతం కంగారూలు నెట్స్‌లో తీవ్రంగా శ్రమించారు. కాస్త సంయమనం పాటిస్తే భారత పిచ్‌పై పరుగులు చేయడం పెద్ద కష్టం కాదని వికెట్ కీపర్ కోన శ్రీకర్ భరత్ అన్నాడు. డిఫెన్స్‌ను కట్టుబడి ఉంటే పరుగులు వాటంతటవే వస్తాయని పేర్కొన్నాడు. గత టెస్టుల్లో అరుగురు ఆసీస్ ఆటగాళ్లు స్వీప్ షాట్లు ఆడే ప్రయత్నంలో ఔటైన విషయం తెలిసిందే.గాయం కారణంగా తొలి రెండు టెస్టులకు దూరమైన స్టార్ పేసర్ మిచెల్ స్టార్క్ వంద శాతం ఫిట్‌గా లేకున్నా.. కమిన్స్ స్థానంలో తుది జట్టులో అతడు ఆడటం ఖాయంగా కనిపిస్తున్నది. సోమవారం స్టార్క్ అరగంటకు పైగా బౌలింగ్ చేస్తూ కనిపించాడు. అతడితో పాటు ఆల్‌రౌండర్ గ్రీన్ కూడా ఇండోర్ కూడా నెట్స్‌లో సుదీర్ఘ స్పెల్స్ వేశాడు.

# చరిత్ర సృష్టించిన న్యూజిలాండ్

ఫాలో ఆడి ఒక్క పరుగుతో అద్భుత విజయం

మూడో జట్టుగా చరిత్ర సృష్టించిన న్యూజిలాండ్



**వెల్లింగ్టన్, ఫిబ్రవరి 28 (సమ సమాజం):** వెల్లింగ్టన్ టెస్టులో ఆతిథ్య న్యూజిలాండ్ జట్టు సంచలన విజయం నమోదు చేసింది. ఉత్కంఠ పోరులో ఒక్క పరుగు తేడాతో ఇంగ్లండ్‌పై గెలుపొందింది. రెండు టెస్టుల సిరీస్‌ను 1–1తో సమం చేసింది. దాంతో, ఫాలో ఆన్ ఆడిన తర్వాత మ్యాచ్ గెలిచిన మూడో జట్టుగా చరిత్ర సృష్టించింది. ఆఖరి రోజు కివీస్ ఫాస్ట్ బౌలర్ నీల్ వాగ్నర్ చెలరేగడంతో ఇంగ్లండ్ కుప్పకూలింది. అతని బౌలింగ్ ధాటికి ఆ జట్టు బాజ్‌బాల్ టెక్నిక్ పనిచేయలేదు. తొలి ఇన్నింగ్స్‌లో సెంచరీ కొట్టిన జో రూట్ (95) ఒక్కడే ప్రతిఘటించాడు. మిగతా బ్యాటర్లు చేతులెత్తేయడంతో రెండో ఇన్నింగ్స్‌లో ఇంగ్లండ్ 256 పరుగులకే ఆలౌట్ అయింది. కివీస్ బౌలర్లలో వాగ్నర్ నాలుగు, సౌథీ మూడు, మ్యాట్ హెన్రీ రెండు వికెట్లు తీశారు. శతకంతో మెరిసిన విలియమ్సన్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్, ఈ సిరీస్‌లో అదరగొట్టిన హ్యారీ బ్రూక్‌కు ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డులు దక్కాయి.దాదాపు ఓటమి ఖాయం అనుకున్న రెండో టెస్టులో న్యూజిలాండ్ అద్భుతం చేసింది. మొదటి ఇన్నింగ్స్‌లో కివీస్ 209 రన్స్ మాత్రమే చేసింది. ఆ తర్వాత బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ 435–8 వద్ద ఇన్నింగ్స్ డిక్లేర్ చేసింది. హ్యారీ బ్రూక్ (186), జో రూట్(153) శతకాలతో చెలరేగారు. అయితే.. రెండో ఇన్నింగ్స్‌లో న్యూజిలాండ్ ధీటుగా బదులిచ్చింది. కేన్ విలియమ్సన్ సెంచరీ, లాథమ్ (83), వికెట్ కీపర్ టామ్ బ్లండెల్ (90) అర్ధ శతకాలతో రాణించడంతో భారీ స్కోర్ చేసింది. ఆ జట్టు 483 పరుగులకు ఆలౌట్ అయింది. ఓవర్‌నైట్ స్కోర్ 48తో ఉన్న ఇంగ్లండ్‌ను వాగ్నర్ దెబ్బతీశాడు. బౌన్సర్లతో ఇంగ్లండ్ బ్యాటర్లను బెంబేలెత్తించాడు. దాంతో, ఐదో రోజు ఆ జట్టు ఆలౌట్ అయింది. దాంతో 2017 తర్వాత కివీస్ గడ్డపై సిరీస్ గెలిచిన జట్టుగా రికార్డు తిరగరాయాలనుకున్న ఇంగ్లండ్ కల కలగానే మిగిలింది. రెండో టెస్టులో న్యూజిలాండ్ విజయాన్ని మరో అద్భుతం అని చెప్పొచ్చు. ఎందుకుంటే.. మొదటి ఇన్నింగ్స్‌లో 209కే ఆలౌట్ అయి ఫాలో ఆడిన ఆ జట్టు రెండో ఇన్నింగ్స్‌లో ధీటుగా ఆడింది. 483 రన్స్ చేసింది. ఛేజింగ్‌లో ఇంగ్లండ్ కడదాకా పోరాడిన ఫలితం లేకపోయింది. ఇంతకుముందు భారత్, ఇంగ్లండ్ జట్లు ఫాలో ఆన్ ఆడి మ్యాచ్ గెలిచి సంచలనం నమోదు చేశాయి. ఇప్పుడు న్యూజిలాండ్ కూడా ఈ జాబితాలో చేరింది. దాదాపు 146 ఏళ్ల టెస్టు ఫార్మాట్ చరిత్రలో ఇలా జరగడం ఇది నాలుగోసారి.

**టెన్నిస్ దిగ్గజం నొవాక్ జొకోవిచ్ రికార్డు**

## నంబర్‌వన్ ప్లేయర్‌గా కొనసాగిన ఘనత

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 28 (సమ సమాజం):** టెన్నిస్ దిగ్గజం నొవాక్ జొకోవిచ్ చరిత్ర సృష్టించాడు. 1973 నుంచి కంప్యూటర్ ర్యాంకింగ్స్ మొదలయ్యాక అత్యధిక వారాలు వరల్డ్ నంబర్ వన్ ర్యాంకులో కొనసాగిన ప్లేయర్‌గా అరుదైన ఘనత సాధించాడు. గతంలో స్టెఫీ గ్రాఫ్ 377 వారాల పాటు నెంబర్ వన్ ర్యాంకులో కొనసాగగా... ఈ రికార్డును జొకోవిచ్ బద్దలు కొట్టాడు. జొకోవిచ్ 378 వారాల పాటు నెంబర్ వన్ ర్యాంకులో కొనసాగాడు. వీరి తర్వాత మార్టినా 332 వారాలు, సెరెనా 319 వారాలు, ఫెదరర్ 310 వారాల పాటు నెంబర్ వన్ ర్యాంకులో కొనసాగారు. ఇటీవలే ఆస్ట్రేలియన్ ఓపెన్ గెలిచిన జొకోవిచ్...తన ఖాతాలో 22 గ్రాండ్ స్లామ్ టైటిల్స్ వేసుకున్నాడు. దీంతో మరోసారి నెంబర్ ర్యాంకును సొంతం చేసుకున్నాడు.

# రాహుల్‌కు మా మద్దతు ఉంటుంది

ఆటగాడిగా అతడి స్థానం ఎప్పుడూ పదిలమే

కెప్టెన్ రోహిత్ శర్మ వెల్లడి



**ఇండోర్,ఫిబ్రవరి 28 (సమ సమాజం):** బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ టెస్టు సిరీస్‌లో కేఎల్ రాహుల్‌కు తమ మద్దతు ఉంటుందని టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ అన్నాడు. ఫామ్‌లో లేక ఆటగాడు కష్టాల్లో ఉంటే..అతనిలో సత్తాను బట్టి ఖచ్చితంగా అవకాశాలు ఇస్తామని స్పష్టం చేశాడు. తమ సత్తాను నిరూపించు కునేందుకు అలాంటి వాళ్లకు సమయం ఇవ్వాలని రోహిత్ శర్మ చెప్పుకొచ్చాడు. వైస్ కెప్టెన్‌గా ఉన్నా.. లేకపోయినా ప్లేయర్ స్థాయిలో ఎలాంటి మార్పు ఉండదని రోహిత్ శర్మ చెప్పాడు. వైస్ కెప్టెన్‌గా ఉన్నాడంటే అప్పటికి జట్టులో అతనే అందరి కన్నా సీనియర్ అయ్యుంటాడని..అయితే ఆ పదవి తీసేసినా ఏమీ మారదన్నాడు. గిల్, కేఎల్ ఇద్దరూ కూడా మ్యాచ్‌కు ముందు గంటల తరబడి ప్రాక్టీస్ చేస్తారని...అది వాళ్లకు అలవాటే..అని రోహిత్ శర్మ తెలిపాడు. మూడో టెస్టులో తుది జట్టులో ఎవరు స్థానం దక్కించుకుంటారో తెలియదని రోహిత్ శర్మ అన్నాడు. అయితే పదకొండు మంది గురించి ఇంకా ఒక నిర్ణయానికి రాలేదని చెప్పాడు. టాస్ వేసే సమయంలోనే దీనిపై క్లారిటీ వస్తుందన్నాడు. అప్పుడే తుది జట్టును ప్రకటిస్తామని వెల్లడించాడు. బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో చివరి రెండు టెస్టులకు ప్రకటించిన జట్టులో వైస్ కెప్టెన్‌గా కేఎల్ రాహుల్‌ను సెలెక్టర్లు తొలగించారు. దీంతో అతన్ని మూడో టెస్టులో ఆడించడం లేదని..గిల్‌ను తీసుకోవడానికే రాహుల్‌ను ఈ పదవి నుంచి తప్పించారని వార్తలు వినిపించాయి. దీనికి తోడు మూడో టెస్టుకు ముందు నెట్స్‌లో గిల్ సుదీర్ఘ సమయం ప్రాక్టీస్ చేశాడు. దీనికి సంబంధించిన వీడియోలు వైరల్ అయ్యాయి. దీంతో రాహుల్‌ను పక్కన పెడుతున్నారని..అందుకే గిల్ ప్రాక్టీస్ చేస్తున్నాడన్న వార్తలకు బలం చేకూరింది. అయితే తాజాగా వీటన్నింటిపై రోహిత్ శర్మ స్పందించాడు.

# వాంఖేడీ స్టేడియంలో సచిన్ విగ్రహం

తనకు అరుదైన అదృష్టంగా పేర్కొన్న టెండుల్కర్



**ముబై,ఫిబ్రవరి 28 (సమ సమాజం):** క్రికెట్ గాడ్ గా పేరొందిన సచిన్ టెండూల్కర్‌కు అరుదైన గౌరవం ఇవ్వాలని ముంబై క్రికెట్ అసోసియేషన్ నిర్ణయించుకుంది. వాంఖడే స్టేడియంలో సచిన్ నిలువెత్తు విగ్రహాన్ని ఏర్పాటు చేయనుంది. ఏప్రిల్ 24న సచిన్ తన 50 పుట్టిన రోజును జరుపుకోనున్నాడు. దీనికి ఒక్క రోజు ముందు అంటే 23వ తేదీన సచిన్ విగ్రహాన్ని ఆవిష్కరించాలని ఎంసీఏ అధికారులు నిర్ణయించారు. వాంఖడే స్టేడియం తనకు ఎంతో ప్రత్యేకమైందని సచిన్ టెండూల్కర్ తెలిపాడు. తన కెరీర్‌లో వాంఖడేలోనే తొలి రంజీ మ్యాచ్ ఆడానని..అంతేకాదు..చివరి అంతర్జాతీయ మ్యాచ్ కూడా ఇక్కడే ఆడినట్లు గుర్తు చేశాడు. తనకు 25 ఏళ్ల అనుభవం ఉన్నా కూడా..ఎప్పటికీ 25 ఏళ్లవ్యక్తిగా ఉన్నానని..అందుకు ఎంసీఏకు ధన్యవాదాలు చెప్తున్నట్లు సచిన్ తెలిపాడు. వాంఖడేలో తన విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ఎంసీఏ తనకు సమాచారం ఇచ్చిందని..తన జీవితంలో ఇది చాలా ప్రత్యేకమైన సందర్భమని సచిన్ పేర్కొన్నాడు. అందుకే విగ్రహం ఎలా ఉండాలి...స్టేడియంలో ఎక్కడ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి...అనే అంశాలపై చర్చించేందుకు వాంఖడేకు వచ్చినట్లు చెప్పాడు. ఇక్కడే సచిన్ తన చివరి అంతర్జాతీయ మ్యాచ్ కూడా ఆడాడు. ఇక 2011లో వన్డే వరల్డ్ కప్ గెలిచి చిరకాల కోరికను నెరవేర్చుకున్నాడు.






**ఆర్‌ఆర్‌ఆర్ అవార్డులకు దూరంగా ఎన్టీఆర్**

**తారక్ మరణంతో అమెరికా వెళ్లలేకపోయిన జూనియర్**

ప్రస్తుతం అంతర్జాతీయ వేదికలపై ఆర్‌ఆర్‌ఆర్ హవా నడుస్తుంది. ఇటీవలే గోల్డెన్ గ్లోబ్ అవార్డు అందుకుని చరిత్ర సృష్టించిన ఆర్‌ఆర్‌ఆర్ ఇప్పుడు ఆస్కార్ రేసుకు సిద్ధమైంది. బెస్ట్ ఒరిజినల్ సాంగ్ కేటగిరిలో ఆర్‌ఆర్‌ఆర్ నుంచి నాటు నాటు పాట ఆస్కార్ ఫైనల్ నామినేషన్స్‌లో చోటు దక్కించుకుంది. ఈ అవార్డుల ప్రధానోత్సవం మార్చి 12న జరుగనుంది. ఇకపోతే ఆర్‌ఆర్‌ఆర్ హాలీవుడ్ క్రిటిక్స్ అసోసియేషన్(హెచ్‌సీఏ) అవార్డుల్లో ఏకంగా 5 అవార్డులను ట్రిపుల్‌ఆర్ గెలుచుకుంది. బ్లాక్‌పాంథర్, టాప్‌గన్, బ్యాట్‌మ్యాన్, ది వుమెన్ కింగ్ వంటి హాలీవుడ్ సినిమాలను వెనక్కి నెట్టి ఆర్‌ఆర్‌ఆర్ విజేతగా నిలిచింది. ఈ అవార్డుల ప్రధానోత్సవానికి దర్శకుడు రాజమౌళితో పాటు రామ్‌చరణ్, కార్తికేయ, ఎమ్.ఎమ్ కీరవాణి, కే.కే సెంథిల్‌కుమార్ హాజరయ్యారు. కానీ తారక్ మాత్రం ఈ కార్యక్రమానికి వెళ్లలేదు. దాంతో తారక్ అభిమానులు హెచ్‌సీఏను ట్యాగ్ చేస్తూ ఎన్టీఆర్‌ను పిలవలేదా? అంటూ పోస్టులు పెట్టారు. కాగా తాజాగా హెచ్‌సీఏ ఈ ట్వీట్స్‌పై స్పందించింది. తారక్ రాకపోవడానికి కారణాలను తెలిపింది. ఈ అవార్డుల కార్యక్రమానికి తారక్‌ను పిలిచామని, కానీ తారక్ ఇండియాలో ఓ సినిమా షూటింగ్ కారణంగా రాలేక పోయాడని హెచ్‌సీఏ తెలిపింది. అంతేకాకుండా తన సోదరుడు తారకరత్న మరణించడంతో షూటింగ్ కూడా నిలిపివేశారని వెల్లడించింది. అయితే త్వరలోనే ఈ అవార్డును ఎన్టీఆర్‌కు అందజేస్తామని, మీ అందరి ప్రేమాభిమానాలకు ధన్యవాదాలు అంటూ ట్వీట్ చేసింది. దీంతో ఎన్టీఆర్ హెచ్‌సీఏ అవార్డుల కార్యక్రమానికి వెళ్లకపోవడంపై ఫ్యాన్స్‌కు ఫుల్ క్లారిటీ వచ్చేసింది.

తొలి తెలంగాణ చిత్రం బలగం

3న విడుదలకు సన్నాహాలు

రాజన్నసిరిసిల్ల జిల్లా నుంచి తొలి పెద్ద సినిమా 'బలగం' ప్రేక్షకుల ముందుకు రానుంది. సిరిసిల్ల పట్టణంలోని బీవైనగర్ చెందిన ఎల్దండి వేణు దర్శకత్వం వహించిన ఈ చిత్రం పల్లెటూరి వాతావరణాన్ని ప్రతిబింబిస్తున్నది. జిల్లాలోని పలు గ్రామాలలో షూటింగ్ నిర్వహించారు. దీంతో సుమారుగా 200 మందికి పైగా గ్రామస్తులు చిత్రంలో కనిపించబోతున్నారు. జిల్లాలో తొలి పెద్ద సినిమా అయిన బలగం మూవీ మార్చి 3న రిలీజ్ అయి ప్రేక్షకులకు ముందుకు రానుండటంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. సిరిసిల్ల పట్టణంలోని బీవైనగర్‌కు చెందిన ఎల్దండి వేణు దర్శకత్వంలో ఈ చిత్రం రానున్నది. 1997లో సిరిసిల్ల మార్కెట్‌లో కూరగాయలు అమ్మిన వేణు ఎల్దండి కమెడియన్‌గా చిత్రసీమలో అడుగు పెట్టాడు. వేణు టిల్లుగా ప్రసిద్ధిగాంచాడు. తెలుగు పాపులర్ కామెడీ షో 'జబర్దస్త్'తో కమెడియన్‌గా ఇండస్ట్రీకి పరిచయ మయ్యాడు. అలా జబర్దస్త్ ద్వారా తెలుగు ప్రేక్షకులకు దగ్గరయి తన కామెడీ కిట్లతో అందర్నీ అలరించాడు. ఇండ్రస్ట్రీలో తనకంటూ ఓ ముద్ర వేసుకుని అంచెలంచెలుగా ఎదుగుతున్నాడు. ఇప్పుడు మెగా ఫోన్ పట్టుకుని 'బలగం' అనే మూవీకి దర్శకత్వం వహించాడు. అచ్చ తెలంగాణ యాసలో ఈ చిత్రాన్ని రూపొందించాడు. పల్లెటూరి నేపథ్యంలో సాగే ఈ సినిమా ప్రకృతి అందాలతో పాటు షూటింగ్‌కు అనువుగా ఉన్న ఓ పాత ఇంటిలో చిత్రీకరించారు. జిల్లాలోని వివిధ గ్రామాల్లో 50 రోజులపాటు ఈ చిత్రాన్ని రూపొందించారు. కోనరావుపేట మండలంలోని కొలనూర్, నాగారం, ధర్మారం, తంగళ్లపల్లి, అగ్రహారం, జిల్లెల్లతో పాటు పలు గ్రామాల్లోని ప్రశాంత వాతావరణంలో సినిమాలోని సన్నివేశాలను చిత్రీకరించారు. ఈ సినిమాలో 200 మందికి పైగా గ్రామస్తులు వివిధ సన్నివేశాల్లో నటించారు. బంధుత్వాలను కలిపే చిన్నచిన్న డైలాగులతో తొలిసారిగా నటించారు. దీంతో వారంతా తొలిసారిగా తెరపై కనబడటంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా తెలంగాణ యాసలో రూపొందిన ఈ సినిమా విజయవంతం కావాలని ఆకాంక్షిస్తున్నారు. సినీ రంగంలో తెలంగాణను ఒక మోడల్‌గా నిలిపేందుకు గ్రామీణ నేపథ్యంలో ఈ చిత్రాన్ని చిత్రీకరించారు. పల్లెటూరిలో మనుషుల మధ్య ఉండే ప్రేమానురాగాలు, బంధుత్వాలు, బంధు బలగాలపై 'బలగం' రూపొందించారు. ఈ సినిమా తెలంగాణ యాసలోనే సినిమా కొనసాగనుంది. దిల్‌రాజు ప్రొడక్షన్స్ శిరీష సమర్పణలో హర్షిత్‌రెడ్డి, హన్షిత ఈ సినిమాను నిర్మించగా, ప్రియదర్శి, కావ్య కళ్యాణ్‌రామ్, సుధాకర్‌రెడ్డి, మురళీధర్‌గౌడ్, తదితరులు ప్రధాన తారాగణంగా నటించారు. వేణు ఎల్దండి దర్శకత్వం వహించారు. కొత్త సినిమా కాన్సెప్ట్ సినిమాలను చేస్తూ కొత్త టాలెంట్‌ను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో హర్షిత్, హన్షిత కలిసి నా పేరుతో ప్రొడక్షన్‌ను ఆరంభించినట్లు చిత్ర నిర్మాత దిల్‌రాజు తెలిపారు. ముఖ్యంగా భీమ్స్ సంగీతంలో కాసర్ల శ్యామ్ రాసిన పాటలు హృదయాలకు హత్తుకుంటాయని, ప్రతి ఒక్కరికీ తప్పకుండా నచ్చడంతో పాటు ఈ సినిమా విజయవంతమవుతుందన్న విశ్వాసం ఉందని దిల్‌రాజు అన్నారు.




**సామజవరగమనతో వస్తోన్న శ్రీవిష్ణు**




ఫలితం ఎలా ఉన్నా కంటెంట్ ఉన్న కథలను ఎంచుకోవడంలో శ్రీవిష్ణు ముందు వరుసలో ఉంటాడు. జయాపజాయలతో సంబంధంలేకుండా ప్రేక్షకులకు కొత్త తరహా కథలను పరిచయం చేస్తుంటాడు. కెరీర్ మొదటి నుండి శ్రీవిష్ణు విభిన్న జానర్లో సినిమాలను చేస్తూ ప్రేక్షకులలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నాడు. కాగా గతేడాది ఆయన నటించిన 'అల్లూరి' విడుదలై పాజిటీవ్ టాక్ తెచ్చుకుంది. కానీ కమర్షియల్ సక్సెస్ సాధించలేకపోయింది. ప్రస్తుతం శ్రీవిష్ణు 'వివాహా భోజనంబు' ఫేమ్ రామ్ అబ్బరాజుతో సామజవరగమన అనే సినిమా చేస్తున్నాడు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ చివరి దశలో ఉంది. తాజాగా మేకర్స్ ఈ సినిమా టీజర్‌ను రిలీజ్ చేశారు. గ్లింప్స్‌తోనే మేకర్స్ సినిమా ఎలా ఉంటుందో కాస్త క్లారిటీ ఇచ్చే ప్రయత్నం చేశారు. ప్రేమించి పెళ్లి చేసుకునే వాళ్లకి పలు ప్రాబ్లమ్స్ ఉంటాయన్న మాట వాస్తవం. కానీ ఈ సినిమాలో మాత్రం శ్రీవిష్ణు ఎవ్వరికి లేని వింత ప్రాబ్లమ్ ఫేస్ చేస్తున్నట్లు తెలుస్తుంది. మరీ ఆ వింత ప్రాబ్లమ్ ఎంటో తెలియాలంటే సినిమా వచ్చే వరకు వేచి చూడాల్సిందే. అగ్ర నిర్మాణ సంస్థ ఏకే ఎంటర్‌టైనమెంట్స్ బ్యానర్ రూపొందించిన సినిమా కావడంతో క్వాలిటీ విషయంలో రాజీ పడినట్లు కనిపించలేదు. ఫస్ట్ ఫ్రేమ్ నుండి లాస్ట్ ఫ్రేమ్ వరకు గ్లింప్స్ చాలా రిచ్‌గా కనిపించింది. గోపి సుందర్ మ్యూజిక్ కూడా ఫ్రెష్‌గా ఉంది. ఇక గ్లింప్స్‌లో ప్రేమించి పెళ్లి చేసుకునే వాళ్లకి కాస్ట్ ప్రాబ్లమ్ వస్తుంది లేదా క్యాష్ ప్రాబ్లమ్ వస్తుంది. కానీ నాకేంట్రా ఎవరకీ రాని వింత ప్రాబ్లమ్ వచ్చింది అంటూ శ్రీవిష్ణు చెప్పే డైలాగ్స్ ఆకట్టుకుంటున్నాయి. అవుట్ అండ్ అవుట్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ సినిమాలో విష్ణుకు జోడీగా బిగిల్ ఫేమ్ రెబా మోనికా జాన్ నటిస్తుంది. హాస్య మూవీస్ బ్యానర్‌పై రాజేష్ దండ ఈ సినిమాను నిర్మిస్తున్నాడు. గోపి సుందర్ స్వరకల్పనలో రూపొందుతున్న ఈ సినిమా వేసవిలో హాస్యపు విందులు వడ్డించడానికి ముస్తాబువుతుంది.

Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at **Panidhar PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**,
RNI.TELTEL/2016/ 73311, Cell:8464816456 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in